

ప్రముఖ ఇంజినీర్ చంద్రశేఖర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గత ప్రభుత్వంలో ఏలూరు పెద్ద వంతెన నుంచి తూర్పువీధి గంగానమ్మ ఆలయం సెంటర్ వరకు రోడ్డు వెడల్పు చేసి విశాలంగా తీర్చిదిద్దిన ప్రముఖ ఇంజినీరు, కాంట్రాక్టర్ మోటేపల్లి చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో పట్టు కండువా జ్ఞాపికలతో జరిగిన సత్కారంలో కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు, నగర అధ్యక్షులు వాసా రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు బుజ్జి, జాయింట్ సెక్రటరీ కొప్పిశెట్టి వేణుగోపాల్, నగర కార్యదర్శులు వంగల శివ, గొడవర్తి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న వక్తలు

'బరి' తెగింపు..!

- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు
- ప్రేక్షక పాత్రలో పోలీసులు
- రెండు జిల్లాల్లో తొలిరోజు 250కు పైగా బరుల్లో కోడిపందేలు
- టిడిపి, వైసిపి పోటాపోటీగా బరుల ఏర్పాటు
- పందేల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, ప్రముఖులు
- పందేలను ప్రారంభించిన ఎంపీ రఘురామకృష్ణంరాజు
- బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాట జోరు
- పెదఅమిరం బరిలో అత్యధిక పందెం రూ.4 లక్షలు


టి.నరసాపురంలో పందేల జోరు

కోర్టు తీర్పులంటే లెక్క లేదు.. మూగ జీవాలంటే దయలేదు. చట్టాలను గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే కోడి పందేలకు ప్రారంభోత్సవాలు చేయడం గమనార్హం. అడ్డుకోవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమై మామూళ్ల మత్తులో జోగుతుండటంతో ఈ ఏడాదీ కోడి పందేలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. పందెంరాయుళ్లు బరి తెగించి కోడి పందేలు నిర్వహించారు. రెండు జిల్లాల్లోనూ తొలి రోజు భోగి పండుగ ఆదివారం దాదాపు 250కు పైగా బరుల్లో రూ.50 కోట్లు మేర పందేల్లో చేతులు మారినట్లు అంచనా. బరుల వద్ద పేకాట, గుండాట జోరు కొనసాగింది. ఎంపీలు, ఎంఎల్‌ఎలే దగ్గరుండి పందేలను ప్రారంభించడంతో ఇక పండుగ మూడు రోజులు కోళ్ల కొట్లాట యథేచ్ఛగా సాగనుంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలను జిల్లా అధికారులు తుంగలో తొక్కారు. ఆదివారం భోగి రోజు ఉదయం 11 గంటల తర్వాత రెండు జిల్లాల్లోనూ కోడి పందేల జోరు సాగింది. మధ్యాహ్నం నుంచి గుండాట, మూడు ముక్కలాటలను అనుమతించడంతో బరులన్నీ జాతరను తలపించాయి. టిడిపి, వైసిపి నాయకులు పోటాపోటీగా కోడి పందేల బరులు ఏర్పాటు చేసి పందేలు సాగించారు. రెండు జిల్లాల్లోనూ తొలిరోజు పెద్దా, చిన్నా 250కుపైగా బరుల్లో పందేలు యథేచ్ఛగా సాగాయి. దాదాపు రూ.50 కోట్లు వరకూ బెట్టింగుల రూపంలో చేతులు మారినట్లు అంచనా. సోమ, మంగళవారాలు సంక్రాంతి, కనుమ రోజు పందేల జోరు మరింత పెరగనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. ప్రధాన రహదారులకు పక్కగా పందేలు సాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు భీమవరంలో తన ఇంటి వద్ద కోడిని వదిలి పందేలను ప్రారంభించారు. కాళ్ల మండలం పెదఅమిరంలో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో సాగిన బరి రెండు జిల్లాల్లోనే అతిపెద్ద బరిగా చెబుతున్నారు. ఇక్కడ అత్యధిక పందెం తొలిరోజు రూ.నాలుగు లక్షల వరకూ సాగినట్లు తెలిసింది. ఇక్కడ జరిగిన కోడిపందేల్లో వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరిసింహారాజు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, తెలంగాణ నాయకులు తీగల కృష్ణారెడ్డి వంటివారు పాల్గొన్నారు. టిడిపి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సీసలిలోని కోడిపందేల బరిలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌తోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ రెండు బరుల్లోనూ పందేలు పోటాపోటీగా సాగాయి. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కోడిపందేల బరిలో దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి, తెలంగాణ ఇల్లెందు ఎంఎల్‌ఎ కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎంఎల్‌ఎ ఆదినారాయణ వంటి పలువురు నాయకులు పందేల్లో పాల్గొన్నారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు తన సొంతూరు బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో కోడిపందేలను ప్రారంభించారు. యలమంచిలిలో జరిగిన పందేల్లో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ పాల్గొని తిలకించారు. ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిర్వహించేందుకు సైతం ఏర్పాట్లు చేశారు. బరుల వద్ద కార్లు, బైక్‌లు చూసి అంతా ఆశ్చర్యపోతున్న పరిస్థితి ఉంది. బరుల వద్ద మద్యం అమ్మకాలు సైతం యథేచ్ఛగా సాగాయి.

మామూళ్ల మత్తులో పోలీసులు

పందేలను అడ్డుకుంటామంటూ నిన్నటి వరకూ బీరాలు పలికిన పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. భోగి రోజు రెండు జిల్లాల్లోనూ యథేచ్ఛగా పందేలు సాగినా అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. బరుల ప్రాతిపదికన మామూళ్లు వసూలు చేసి వాటాలు పంచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి మండలంలోనూ చిన్న, పెద్ద పదికిపైగా బరులు కొనసాగాయి. ఎక్కడ అనువుగా ఉంటే అక్కడ పందేల బరుల ఏర్పాటు జరిగిపోయింది. సోమ, మంగళవారాల్లో మరింత జోరుగా పందేలు సాగనున్నాయి.

పండుగ వేళ పెనువిషాదం

లారీ ఢీకొని చెల్లెలు మృతి
అక్కకు తీవ్ర గాయాలు


మృతిచెందిన తేజస్వి

ప్రజాశక్తి - మండవల్లి

మితిమీరిన వేగంతో వస్తున్న లారీ రోడ్డు పక్కనే నడుచుకుంటున్న యువతులను వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా మండవల్లి మండలం కానుకొల్లులో పంగిళ్ల నాగబాబు ఇంటి ముందు ఆయన కుమార్తెలు పల్లవి దుర్గ, తేజస్వి (16) శనివారం రాత్రి ముగ్గులు వేస్తున్నారు. ఆ సమయంలో నాగబాబు భార్య కుమార్తెలను పిలిచి గ్యాస్ నొప్పిగా ఉందని సోడా తీసుకురమ్మని పంపించింది. వారు సోడా తీసుకుని ఇంటికి వస్తుండగా గుడివాడ నుంచి కైకలూరు వెళ్తున్న ఇటుకల లోడు లారీ మితిమీరిన వేగంతో దూసుకొచ్చి అక్కాచెల్లెళ్లు ఇద్దరినీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై తేజస్వి అక్కడికక్కడే మృతి చెందగా పల్లవిదుర్గకు చెయ్యి, కాలు విరిగింది. పల్లవి దుర్గను చికిత్స నిమిత్తం గుడివాడలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచి నాగదాసి థామస్, టిడిపి నాయకులు కొడాలి వినోద్, మాజీ సర్పంచి గూడవల్లి కోటేశ్వరరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు ముసలయ్య ఘటనా స్థలానికి చేరుకుని తేజస్వి మృతదేహాన్ని సందర్శించి నాగబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు కుమారుడు వినయ్‌కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పల్లవిదుర్గను పరామర్శించారు. ఆమె చికిత్సకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని హామీ ఇచ్చారు. తేజస్వి తండ్రి పంగిళ్ల నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విధానాల ప్రతులు దహనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, అప్రజాస్వామిక పద్ధతిని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సిఆర్‌రెడ్డి కళాశాల వద్ద భోగిమంటల్లో ప్రభుత్వ విధానాలను దహనం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల చెల్లింపులో ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను నిరసిస్తూ ఇప్పటికే యుటిఎఫ్ అనేక పోరాట కార్యక్రమాలు చేసిందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం, పోరాట కార్యక్రమాల గురించి షెడ్యూల్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో తాలూకా, డివిజన్ కేంద్రాల్లో ఆరు గంటల ధర్నాలు నిర్వహించామని, జిల్లా కేంద్రాల్లో మూడో తేదీన పెద్ద ఎత్తున వందలాది మంది ఉపాధ్యాయులతో 12 గంటల ధర్నా నిర్వహించామని చెప్పారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్ర సంఘం పిలుపుమేరకు రాష్ట్ర కేంద్రం విజయవాడలో 36 గంటల ధర్నాకు వేలాదిమంది ఉపాధ్యాయులు తరలి వెళ్లారని, ఆ ధర్నాకు అనుమతి ఇవ్వకుండా వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయులను నిర్బంధించారని, అరెస్టు చేశారని, అయినప్పటికీ రెండు వేల మంది ఉపాధ్యాయులు విజయవాడకు తరలి వెళ్లగా వారిని వివిధ పోలీస్ స్టేషన్లలో, కన్వెన్షన్ సెంటర్లలో అరెస్ట్ చేసి నిర్బంధించారని చెప్పారు. ఇందుకు నిరసనగా పోరాటాన్ని కొనసాగింపుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో భోగిమంటల్లో ప్రభుత్వ విధానాలను దహనం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నంబూరి రాంబాబు, శివశంకరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు తేరా ప్రసాద్, పెదపాడు మండల ప్రధాన కార్యదర్శి ఎ.రవికుమార్, నగర శాఖ గౌరవ అధ్యక్షులు ఎం.చిట్టిబాబు పాల్గొన్నారు.


భోగిమంటల్లో ప్రతులు దహనం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

పండుగపూటా పోరాట పటిమే

అంగన్‌వాడీలు పండుగపూటా పోరాట పటిమ కొనసాగించారు. వారి సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె ఆదివారంతో 34వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు భోగి మంటల్లో షాకాజ్ నోటీసు ప్రతులను, ఎస్మా చట్టం ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు భోగిమంటల్లో షోకాజ్ నోటీసు ప్రతులను, ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. జీలుగుమిలి, ద్వారకాతిరుమల, ఆగిరిపల్లి, మండవల్లి, కొయ్యలగూడెం, కలిదిండి, చింతలపూడి, నిడమర్రు, టి.నరసాపురం, చాట్రాయి, నూజివీడు, ముసునూరు, భీమడోలులో అంగన్‌వాడీలు ఎస్మా ప్రతులను భోగి మంటల్లో వేసి తమ నిరసన వ్యక్తం చేశారు.


ఏలూరులో...


ఆగిరిపల్లిలో...


ఉంగుటూరులో...


మండవల్లిలో...


ముసునూరులో...


భీమడోలులో...


బుట్టాయగూడెంలో..


చాట్రాయిలో...


చింతలపూడిలో...


ద్వారకాతిరుమలలో...


జీలుగుమిల్లిలో...


కలిదిండిలో...


కొయ్యలగూడెంలో...


నిడమర్రులో...


నూజివీడులో...


వేలేరుపాడులో...

అంతర్మథనం.. అసంతృప్తి.. ఆవేదన..!



పండుగ వేళ కూడా సమస్యలతో రోడ్డెక్కుతున్న జనం ఓ పక్క.. మరోపక్క అధిష్టానం చేర్పులు, మార్పులతో అధికార పార్టీ ఎంఎల్‌ఎల్లో అంతర్మథనం సాగుతుండగా.. పొత్తుల వ్యవహారంలో ఏయే సీట్లు ఎవరికి దక్కుతాయో అర్థంగాక ప్రతిపక్ష టిడిపి, జనసేన నేతల్లో ఒకింత గందరగోళం, అసంతృప్తి నెలకొంది. టిక్కెట్ చేజిక్కించుకున్న వారు ఇక తమ అడుగులు ఎలా వేయాలా అని అంతర్మథనం చేస్తుండగా దక్కని వారు తీవ్ర అసంతృప్తి బాహాటంగానే వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎటూ తేలని వారు ఇన్నాళ్లు తాము పడిన కష్టం ఫలిస్తుందా, లేదా అని ఆవేదనకు గురవుతున్నారు.

జిల్లాలో ఎన్నికల వేడి మరింత రాజుకుంది. మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని పార్టీలూ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా అధికార వైసిపి జిల్లాలో ఇప్పటికే ఏలూరు ఎంపీ, పోలవరం, చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థులను ప్రకటించింది. ప్రధానంగా వైసిపి అధిష్టానం ఇప్పటి వరకూ జిల్లాలో సిట్టింగులను మార్చిన స్థానాలనే అధికారికంగా ప్రకటించింది. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తాను ఎంపీగా పోటీ చేయననడంతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్‌కు టిక్కెట్ దక్కింది. ఆయన కూడా అయిష్టంగానే పోటీకి అంగీకరించినట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఎంపీ అభ్యర్థి మార్పు వల్ల వైసిపి అధిష్టానానికి పెద్దగా ఇబ్బందులేమీ ఏర్పడ లేదు. అయితే చింతలపూడి టిక్కెట్ మార్పు మాత్రం ఆ పార్టీకి చింత మిగులుస్తుందా, లేక సరైనదేనా అనేది ఎన్నికల ఫలితం వెలువడే వరకూ వేచిచూడాలి. ఇక పోలవరం టిక్కెట్ మార్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెల్లం బాలరాజు ఎంఎల్‌ఎగా ఇక్కడ పాత ముఖమే. ఆయనపై వ్యతిరేకత ఉందనే పేరుతో ఆయన భార్య తెల్లం రాజ్యలక్ష్మికే టిక్కెట్ కట్టబెట్టడంపై ఆ పార్టీ నేతలతోపాటు రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భర్త బదులు భార్యకు టిక్కెట్ ఇస్తే వ్యతిరేకత పోతుందా అని ప్రశ్నిస్తున్నారు. అయితే ఇక్కడ టిడిపిలో గ్రూపు విబేధాలు వైసిపికి కలిసొచ్చే అంశమని, అందుకే వైసిపి అధిష్టానం స్వల్ప మార్పుతో సరిపెట్టిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మరికొన్ని స్థానాల్లో సిట్టింగ్ ఎంఎల్‌ఎలను మార్చాలని అధికార పార్టీ యోచిస్తున్నా ఆయా నియోజకవర్గాల్లో సామాజిక తరగతుల పొందిక, దాని ఆధారంగా బలమైన అభ్యర్థులు దొరక్కపోవడంతో కొంత వెనక్కి తగ్గినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికీ ఏలూరు, ఉంగుటూరు, ఉండి, పాలకొల్లు, నరసాపురం స్థానాల్లో సందిగ్ధత అధికార పార్టీలో కొనసాగుతుండటం గమనార్హం. పోలవరం అభ్యర్థిని మార్చిన తరహాలోనే ఏలూరులో అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం ఉంది. ఉంగుటూరులో అదే సామాజిక తరగతికి చెందిన బలమైన అభ్యర్థి లేకపోవడంతో వెనక్కు తగ్గుతున్నట్లు తెలుస్తోంది. పాలకొల్లు టిక్కెట్ ఎవరికి దక్కుతుందో నామినేషన్ల పర్వం వరకూ చెప్పలేమని అధికార పార్టీ నేతలే చెబుతుండటం గమనార్హం. నరసాపురంలో సిట్టింగుకే మళ్లీ దక్కే అవకాశం ఉందని, ఉండిలో మాత్రం ఎంపీ అభ్యర్థిని బట్టి నిర్ణయం ఉండొచ్చనే ప్రచారం ఇటీవల మొదలైంది. ఏదేమైనా అధికార పార్టీలోనూ అభ్యర్థుల ఎంపిక అధిష్టానానికి కత్తిమీద సాములా తయారైనట్లు కన్పిస్తోంది.

ఇక పొత్తుల వల్ల ఏ స్థానం నుంచి ఏ పార్టీ పోటీ చేస్తుందో స్పష్టత లేక టిడిపి, జనసేన నేతలు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా ఏలూరు జిల్లాలో దెందులూరు, కైకలూరు, నూజివీడు స్థానాలు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, ఉండి, తణుకు, పాలకొల్లు స్థానాల్లో టిడిపికి పెద్దగా ఇబ్బంది లేదు. నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం స్థానాలు పొత్తులో జనసేనకు ఏవి వెళ్తాయో తేలక ఇటు టిడిపి, అటు జనసేన నేతల్లో ఉత్కంఠ నెలకొంది. జనసేన ఆశావహుల పరిస్థితి ఎలాగున్నా టిడిపి ఆశావహుల్లో మాత్రం ఒకింత ఆవేదన సైతం కన్పిస్తోంది. ఇంతకాలం తాము చాలా సొమ్ము ఖర్చు పెట్టామని, ఇప్పుడు పొత్తులో సీటు మిత్రపక్షానికి వెళ్తే తమ పరిస్థితి ఏమిటని నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్



బహుమతులు అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

మేధాశక్తిని పెంచేందుకు చెస్ పోటీలు దోహదం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పిల్లల్లో మేధాశక్తిని పెంచేందుకు చెస్ పోటీలు దోహదపడతాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. డివైఎఫ్ఐ సంక్రాంతి యువజన ఉత్సవాల్లో భాగంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన చెస్ జిల్లా ఓపెన్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆయన ఆదివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ చెస్ పోటీలు పిల్లల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు దోహదం చేస్తాయన్నారు. ప్రతి సంవత్సరం డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా తదితర ప్రజాసంఘాలు సంక్రాంతి సందర్భంగా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కోనేరు హంపి, విశ్వనాథ్ ఆనంద్ వంటి ఛాంపియన్స్ కూడా ప్రారంభంలో ఇటువంటి పోటీల్లో పాల్గొని అనుభవం గడిచిన వారే అని గుర్తు చేశారు. నేటి విద్యా విధానాలు పిల్లలు పెద్ద పెద్ద ర్యాంకులు రావాలని ఒత్తిడి పెంచే విధంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది ప్రజా సంఘాలన్నీ కలిపి సంక్రాంతి సందర్భంగా ఇటువంటి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ పండుగ సందర్భంగా కొందరు పేకాట, కోడిపందేలు వంటి జూద క్రీడలు నిర్వహిస్తున్నారని, దీంతో యువత వాటితో పాటు మత్తుపదార్థాల వైపు మరలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా కాపాడటం కోసమే ప్రజాసంఘాలు ప్రతి ఏటా సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఠాగూర్‌రాజా, సిఐటియు నాయకులు పి.కిషోర్, చెస్ చీఫ్ ఆర్బిటర్ కృష్ణకుమారి, కోచ్ డి.లక్ష్మణరావు, హైమా మాట్లాడారు. సభ అనంతరం గెలుపొందిన విజేతలకు మెమొంటో, సర్టిఫికెట్, నగదు బహుమతులు అందించారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఓ ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పచ్చగా ఉండాల్సిన పల్లె సీమలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ విధానాలతో కోనరిల్లుతున్నాయని, కరువు కాటకాలు, వరదలు ముంచెత్తి రైతుల నడ్డి విరగగొడుతున్నాయని, రైతులు, కూలీలు సహాయం కోసం ఎదురు చూసి నిరాశపడుతున్నారని, ఇంకోవైపు జిల్లాలో వేలాదిమందిగా ఉన్న అంగనవాడీలు సంక్రాంతి లోపు తమ సమస్య పరిష్కారమవుతుందని ఎదురు చూసి ప్రభుత్వ మొండి వైఖరితో నిరాశ చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి సంతోషంగా వారి కుటుంబాలతో సంబరాలు జరుపుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.



పోటీలు నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా ఉండేందుకు సంక్రాంతి పండుగ సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని డివైఎఫ్ఐ ఏలూరు అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం భోగి సందర్భంగా స్థానిక చోడిదిబ్బ ప్రాంతంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది డివైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి అంటే కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం కోడిపందేలు, జూద క్రీడలను ప్రోత్సహించి యువతను చెడుదారి పట్టేవిధంగా చేస్తున్నారన్నారు. వాటి నుంచి మంచివైపు మరల్చే విధంగా వీధి వీధినా ఈ ఆట పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కోడిపందేలు, జూద క్రీడలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.ఠాగూర్‌రాజా, స్థానిక పెద్దలు బొత్స సింహాచలం, శేఖర్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో సంక్రాంతి సంబరాలు

చినవెంకన్న ఆలయంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు దేవస్థానం వారు ఘనంగా నిర్వహించారు. పల్లెటూరి ఆచారాలు ఉట్టిపడేలా నమూనాలు ఏర్పాటు చేశారు. గంగిరెద్దులు ఆకర్షణగా నిలిచాయి. కుమ్మరి చక్రం ఏర్పాటు చేశారు. ఈ చక్రంపై మట్టి పాత్రల తయారీ విధానం యాత్రికులు చూసి ఆనందించారు. గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై భోగి మంటలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు మాట్లాడుతూ భక్తులు తిలకించే విధంగా సంక్రాంతి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, మండల యూత్ అధ్యక్షులు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు-2 పెద్దిరెడ్డి రమ్యకుసుమ, ఎంపిటిసి సభ్యులు-1 రుద్ర సూర్యకళవెంకటశివాజీ, టౌన్ ప్రెసిడెంట్ అచ్యుత ఏసుబాబు, సీనియర్ నాయకులు ఉక్కుర్తి వెంకటరావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ :దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌తో కలిసి దెందులూరు గ్రామంలో ఘనంగా నిర్వహించిన సంక్రాంతి జీవవైవిధ్య సంబరాల్లో పాల్గొన్నారు. భోగి మంటలను వెలిగించారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ప్రజలందరికీ ఎంపీ, ఎంఎల్ఎ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ముదినేపల్లి :మండలంలోని సింగరాయపాలెంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామ సర్పంచి బోయిన రామరాజు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో గ్రామ మహిళలు, యువతులు పాల్గొన్నారు. స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.8 వేలు, రెండో బహుమతి రూ.6 వేలు, మూడో బహుమతి రూ.నాలుగు వేలు రామరాజు తన చేతులు మీదుగా అందించారు.



ముదినేపల్లిలో ముగ్గులపోటీలు

ఆ రోడ్డుపై ప్రయాణం.. ప్రమాదకరం

గోతులమయంగా మల్లుకుంట - టి.నరసాపురం రోడ్డు

వల్లంపట్ల వద్ద ఏర్పడిన భారీ గొయ్యి

భయాందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మల్లుకుంట - టి.నరసాపురం ఆర్అండ్‌బి రోడ్డు వల్లంపట్ల వద్ద ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. నిత్యం వాహన రాకపోకలు సాగించే ఈ రోడ్డులో చింతలపూడి నుంచి టి.నరసాపురం మీదుగా బొర్రంపాలెం, జంగారెడ్డిగూడెం, రాజమండ్రి ప్రాంతాలకు ప్రయాణించడానికి ఈ రోడ్డు ప్రధాన రహదారిగా ఉంది. కొంతకాలంగా రోడ్డుపై ఏర్పడిన గొయ్యి క్రమేపి పెరుగుతూ పెద్దదిగా మారింది. వర్షాకాలంలో గోతిలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం వాహనదారులు, ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. వైసిపి అధికారం చేపట్టిన తరువాత బొర్రంపాలెంలో అధ్వానంగా ఉన్న రోడ్డు అభివృద్ధి చేశారు కాని బొర్రంపాలెం నుంచి మల్లుకుంట, రావికంపాడు అడ్డరోడ్డు వరకు ఉన్న గోతులు పూడ్చకుండాచ మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో పలుచోట్ల గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనదారులకు సౌకర్యవంతమైన రోడ్లు నిర్మించాలని, మండలంలో అధ్వానంగా ఉన్న పుల్రేపు, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, అప్పలరాజుగూడెం రోడ్లు కూడా అబివృద్ధి ప్రజలు కోరుతున్నారు.



వల్లంపట్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

అధ్వాన రోడ్లు అబివృద్ధి చేయాలి

అనుమోలు మురళి, సిపిఎం మండల కార్యదర్శి



మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధి చేయాలి. గత టిడిపి హయాంలో మండలంలో ఒక్క రోడ్డు అభివృద్ధి చేయలేదు. వైసిపి అధికారం చేపట్టిన తరువాత కూడా రోడ్లు అభివృద్ధి చేయలేదు. మండలంలోని పుల్రేపు, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం, మర్రిగూడెం, బంధంచర్ల గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్లపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారినా అబివృద్ధి లేదు. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి చేయాలి. లేకపోతే ఆందోళనలు చేపడతాం.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి

ముదినేపల్లి : మండలంలోని పెయ్యేరు గ్రామ మాజీ సర్పంచి బొడ్డు మోహనరావు (60) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. మోహనరావు మండలంలోని వి.రావిగుంట గ్రామంలో జరిగే వారి బంధువు అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. అక్కడ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహిస్తుండగా మోహనరావుకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతి చెందారు. మోహనరావు పెయ్యేరు గ్రామ సర్పంచిగా రెండు పర్యాయలు పని చేశారు. మోహనరావుకు భార్య, కుమార్తె ఉన్నారు. మోహనరావు ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీ చేరుకుని మృతదేహాన్ని సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మోహనరావు అంత్యక్రియలు సోమవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



మోహనరావు (ఫైల్)

ప్రత్యేక దళిత పంచాయతీల ఏర్పాటుకు త్వరలో జిఒ

సిఎం జగన్ హామీ ఇచ్చారని తెలిపిన ఫైర్ డిజిపి సునీల్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రత్యేక దళిత పంచాయతీల ఏర్పాటుకు త్వరలోనే జిఒ ఇస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు నివారణ శాఖ డిజిపి పివి.సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా స్థానికులు భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా పివి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి దళితవాడ ప్రత్యేక పంచాయతీ కావాలని, దళితులు తమను తాము పరిపాలించుకోవాలని, ప్రతి దళిత వాడకు రూ.రెండు కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు. ప్రతి దళిత వాడలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయం, మోడ్రన్ పాఠశాలలు, మంచి ఉచిత హాస్పిటల్స్ రావాలని పదేళ్లుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై సిఎం జగన్‌ను కలిసినప్పుడు నెల రోజుల్లో ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దళిత వాడలు ప్రత్యేక పంచాయతీలు చేయటం తన లక్ష్యమని చెప్పారు. ఎంఎల్ఎ, ఎంపీ సీట్లు తనకు వద్దని, అటువంటి ఆలోచన కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్.రాజేంద్ర, పోడేటి రాంబాబు, ఎయిమ్ నాయకులు తుల్లిమిల్లి అవినాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పివి.సునీల్‌కుమార్

భూ యాజమాన్య హక్కుల చట్టం రద్దు చేయాలి

భోగిమంటల్లో కాపీలు దహనం

ప్రజాశక్తి - దెందులూరు (పోతునూరు)

రైతులకు నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కుల చట్టం-2022 (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చట్టం కాపీలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పోతునూరులోని రామాలయం సెంటర్‌లో భోగిమంటల్లో వేసి దహనం చేసి చేసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. రైతుల హక్కులను హరించే భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కుల చట్టం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్లకు రైతుల భూములను కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నీతి ఆయోగ్ తీసుకొచ్చిన ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతుల హక్కులను హరించే భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ పోరాట యోధుడు అమరజీవి కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి వంటి రైతు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, గంగుల రాజు, నున్న దుర్గారావు, నున్న లక్ష్మణరావు, చల్లా బాలస్వామి, కొల్లా కృష్ణ, బిల్లా వీర్రాజు పాల్గొన్నారు.



దెందులూరులో...



నూజివీడులో...

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జిఒ కాపీలను రైతులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ ఈ చట్టంలో యజమానులు తమ భూములపై హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. చట్టం రద్దయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

20వ రోజుకు న్యాయవాదుల దీక్ష

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు కోరారు. ఈ మేరకు నూజివీడు పట్టణంలోని కోర్టు భవనాల వద్ద న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారంతో 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి రవి మధుశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడాలన్నారు భూహక్కు చట్టం ద్వారా యజమానులు తమ భూములపై హక్కులను కోల్పోతారని తెలిపారు. చట్టం రద్దు చేసేంతవరకూ నిరసన దీక్ష కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవులు, నరసింహారావు, డిక్సన్, బసవరావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోడిపందేలు.. చేతులు మారిన రూ.కోట్లు

రెచ్చిపోయిన నిర్వాహకులు

విచ్చలవిడిగా పేకాట, గుండాట

కానరాని పోలీస్ యంత్రాంగం

ప్రజాశక్తి - మండవల్లి

కోడిపందేల నిర్వహణకు అనుమతులు లేవని, ఆడినా, స్థలం ఇచ్చి సహకరించిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసుల చేసిన హెచ్చరికలు నిర్వీర్యమయ్యాయి. మైకు ప్రచారంతో ఊదరకొట్టిన పోలీసులు కానరాలేదు. దీంతో రెచ్చిపోయిన నిర్వాహకులు పేకాట, గుండాటతో పాటు కోళ్లకు కత్తులు కట్టి కోడిపందేలు నిర్వహించారు. వేలాల్లో కోళ్ల మృత్యువాత పడగా రూ.కోట్లు చేతులు మారాయి. కోడిపందేలకు జిల్లా పోలీస్ యంత్రాంగం అడ్డుకట్ట వేయలేకపోయిందని జంతు ప్రేమికులు విమర్శిస్తున్నారు.

సంక్రాంతిని పురస్కరించుకుని మండవల్లి మండలంలో భారీస్థాయిలో కోడిపందేల శిబిరాలు వెలిశాయి. కానుకొల్లు లింగాల, పెరికేగూడెం, పొట్లచెరువు, చింతపండు, ఇంగిలిపాకలంక, పులపర్రు గ్రామాలతో పాటు భైరవపట్నం చావులపాడు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని భారీస్థాయిలో కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించారు. ఈ కోడిపందేలను ఆడేందుకు, చూసేందుకు వచ్చిన వారు వాహనాలను జాతీయ రహదారికి ఇరువైపులా ఇష్టానుసారంగా నిలిపి వేయడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. సంక్రాంతి పండుగ మొదటి రోజునే ఇంత భారీ స్థాయిలో కోళ్లకు కత్తులు కట్టి కోడి పందేలు, పేకాట, గుండాట నిర్వహించారంటే మిగిలిన రెండు రోజుల్లో మరింత రెచ్చిపోయి నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయని జంతు ప్రేమికులు అంటున్నారు. జిల్లా అధికార యంత్రాంగం అడ్డుకుంటామని హెచ్చరికలు చేసి ఇప్పుడు కానరావడంలేదు. దీంతో కోడిపందేలు, పేకాట, గుండాటలో పాల్గొని వేలాది రూపాయలు పోగొట్టుకుని సామాన్యుల కుటుంబాలు వీధిన పడిన సంఘటనలతో పాటు విషాదఛాయలనుకున్న సంఘటనలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ యంత్రాంగం స్పందించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి అడ్డుకట్టు వేయాలని కోరుతున్నారు.



మండవల్లిలో కోడిపందేలు



జీలుగుమిల్లిలో గుండాట

కొయ్యలగూడెం :మండలంలో కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. బయ్యన్నగూడెం, గవరవరంలో పెద్దఎత్తున బరులు ఏర్పాటు చేశారు. రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. ప్రజా ప్రతినిధులు సైతం కోడిపందేల నిర్వహణలో పాలు పంచుకుంటున్నారు.

టి.నరసాపురం : సంక్రాంతి సాంప్రదాయం ముసుగులో మండలంలో ఆదివారం యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని టి.నరసాపురం, బందంచర్ల, తిరుమలదేవిపేట, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం గ్రామాల్లో పందెంరాయుళ్లు బరులు సిద్ధం చేసి కోడి పందేలు నిర్వహించారు. కోడిపందేలతో పాటు గుండాట, పేకాట కూడా జోరుగా సాగుతున్నాయి. పందెంరాయుళ్లు బెట్టింగులతో హడావుడి చేశారు. హైదరాబాద్ వంటి పెద్ద పట్టణాల నుంచి పల్లెలకు వచ్చిన బంధువులు ఈ పందేలను తిలకించారు. జూదాల రూపంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. యువత కోడిపందేలతో పాటు పేకాట, గుండాట వంటి జూద క్రీడకు ఆకర్షితులవుతున్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, కామయ్యపాలెం, రాచన్నగూడెం, అంకన్నగూడెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి గ్రామాల్లో కోడిపందేలు ఊపందుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కోడి పందేలు లేకపోవడంతో అక్కడి పందెం రాయుళ్లు కూడా ఇటు రావడంతో పందేలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. కోడి పందేలకు తోడు గుండాట వంటి జూద క్రీడలు పెద్ద ఎత్తున నిర్వహించడంతో బరుల వద్ద జనాలు బారులు తీరారు.

భీమడోలు : మండలంలోని గుండుగొలనులో కోడిపందేలు నిర్వహించారు. కోడిపందేలతో పాటు పేకాట వంటి జూదాలు నిర్వహించారు.

ఉంగుటూరు : మండలంలోని బరుల్లో యథేచ్ఛగా కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు జరిగాయి. ఉంగుటూరు, నారాయణపురం, బాదంపూడి, చేబ్రోలు, గొల్లగూడెం, కైకరం, బాదంపూడి, చినవెల్లమిల్లి, రాచూరులో కోడిపందేల బరులను రాజకీయ నాయకుల అండదండలతో ఏర్పాటు చేశారు. బరుల్లో ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేశారు. కొన్ని బరుల్లో విజేతలకు బుల్లెట్ వాహనాన్ని బహుమతిగా ఉంచారు. దీనికి తోడు కోతాట శిబిరాలు జరుగుతున్నాయి. నారాయణపురంలో కోడిపందేలను ఏలూరు ఎంపీ శ్రీధర్ కొంతసేపు తిలకించినట్లు సమాచారం.



ముసునూరులో కోడిపందేలు

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లో విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహించారు. పందేల్లో రూ.లక్షల్లో చేతులు మారాయి. పేకాట, గుండాట, జూదం వంటి ఆటలతో పాటు మద్యం ఏరులైపారింది. దీంతో పాటు బిర్యానీలు, భోజనాల వసతులు, పలు వ్యాపారాలు జోరుగా సాగాయి. రాజకీయ నాయకుల కనుసన్నల్లో పందెలు నిర్వహించారు.

ముదినేపల్లి : మండలంలో కోడిపందేల బరులు గతం కంటే ఈసారి ఎక్కువయ్యాయి. శనివారం సాయంత్రం నుంచే మండలంలో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఊదరగొట్టిన పోలీసులు జూద క్రీడలు, కోడిపందేల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. మండలంలోని పేరూరు, వడాలి, దేవపూడి, బొమ్మినంపాడు, ఈడేపల్లి పలు గ్రామాల్లో పందేలు జోరుగా నిర్వహిస్తున్నారు.

దళిత యువకుడిపై దాడి

దొంగతనానికి పాల్పడ్డాడనే పేరుతో కర్రాలతో కొట్టిన వైనం

ప్రజాశక్తి - మండవల్లి

మద్యం మత్తులో బడ్డీ కొట్టులో దొంగతనానికి పాల్పడ్డాడనే పేరుతో దళిత యువకుడిని పట్టపగలే దుంగకు కట్టేసి కొట్టిన ఘటన మండలంలోని భైరవపట్నం శివారు అగ్రహారం వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం అయ్యవారి రుద్రవరం గ్రామానికి చెందిన చెందిన దళిత యువకుడు కొండపల్లి సునీల్ (26) మద్యం మత్తులో భైరవపట్నం శివారు అగ్రహారం జాతీయ రహదారి పక్కనే బడ్డీ కొట్టులో ఆదివారం 10 గంటల సమయంలో దొంగతనానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు ఆ యువకుడిని పట్టుకుని బడ్డీ కొట్టు వెనక్కి లాక్కెళ్లి గేదెలు కట్టే దుంగకు కట్టేశారు. అంతటితో ఆగకుండా పట్టపగలే దొంగతనానికి పాల్పడతావా అంటూ కర్రలతో చితకబాదారు. వాటర్ ప్యాకెట్ కోసం ఇక్కడికి వచ్చాను కొట్టకండి అని బతిమిలాడినా విన్పించుకోకుండా కొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. దళిత యువకుడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీనిపై మాలమహాసేన జాతీయ ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు స్పందించి మాట్లాడుతూ దళిత యువకుడిని పట్టుకుని దుంగకు కట్టేసి కొట్టడం అనాగరిక చర్యని అన్నారు. దొంగతనం చేస్తే చట్టపరంగా పోలీసులకు అప్పగించాలని, చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకుని కొట్టడం దారుణమన్నారు. దీనిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ రామచంద్రరావు మాట్లాడుతూ ఘటన పూర్వపరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్యానర్ల కత్తిరింపుపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని రామన్నగూడెం గ్రామంలో టిడిపి బ్యానర్లు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చింపివేశారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలుగు యువత నేత పామర్తి నాగేశ్వరరావు బ్యానర్ ఏర్పాటు చేశారు. బ్యానర్‌పై ముగ్గురు నాయకుల ఫొటోలను కత్తిరించడంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇందుకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలన్నారు.